# తాడు

“పాడవోయి భారతీయుడా, ఆడి, పాడ .... పాడ . .. కిర్ర్ .... ఆఁ ఆఁ .... తంత్యం వచ్చెననీ సభలేచేసి సంబరపడగానే, సంబర బరర బర బర కర్ర్ర్ర్ ....”

లౌడ్ స్పీకర్ను చూస్తూ కూచున్న క్లర్కు రామనాధానికి కోపమొచ్చింది పాట చెడిపోయినందుకు —

రికార్డు తీసేసిన చప్పుడు.

గ్రౌండ్‌లో ఆడుకుంటున్న పిల్లలు గొల్లున నవ్వుతున్నారు. ఒకడు సంబర బర బర అంటూ ఫుట్‌బాల్ తన్నాడు. అందరూ వాణ్ణి అనుకరిస్తున్నారు. ప్రొద్దుటి నుండి ఆడుతున్నా ఎవరూ అలసిపోయినట్లపించడంలేదు —

గేట్ దాకా వచ్చి పైన "సుస్వాగతం" అని రాసివున్న బేనర్‌ను చదువుకుని తమ కొఱకే కట్టారన్నంత ఠీవిగా లోనికొస్తున్నారు వూరివాళ్ళు - కొందరు, మరి కొందరు క్లర్కులాంటివాళ్ళు ఆ సుస్వాగతం మకేనోకాదోనని భయపడుతూ వస్తున్నారు

రాత్రి తన స్వంత చేతుల్తో కట్టిన ఆ బేనర్నూ, లోనికెళుతున్న పెద్ద పెద్ద వాళ్ళనూ, చూసి, లోని కెళ్ళడానికి తన కర్హతుందో లేదోనని ఆందోళన పడుతూ లోన అడుగుపెట్టాడు క్లర్కు రామనాథం, ఉదయం 7 గం॥లకు — అప్పటి నుండి అతనికి తీరికే లేదు.

నాదేముంది లేపేవాళ్ళుంటే ఇలా లేచి ఆడతాను, లేకుంటే ఇలా పడి పోతాను. అన్నట్లు గాలి వీచినప్పడల్లా జాతీయ పతాకం టప టప ఆడి పూరుకుంటోంది.

స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా ఉదయం నుండి తీరికలేక, అలసి పొయ్యాడు స్కూలుక్లర్కు. సహాయ పడేందుకు స్కూలులో చదువుకునే పిల్లలిద్దరున్నారు. ఒకడి పేరు "నిస్వార్థం" మరొకడి పేరు "కృషిశర్మ" వాళ్ళే రాత్రి రెండుదాకా వుండి, ఆవరణంతా, రంగు కాగితాలతో, జండాలతో అలంకరించారు. టీచర్లు, హెడ్మాస్టరు అందరూ మెచ్చుకున్నారు ....

తోరణం కడుతూ నిచ్చెన పైనుండి పడి కాలుకు పెద్దగాయం చేసుకున్న నిస్వార్థాన్ని, టెంపరేచర్తో బాధపడుతున్న కృషిశర్మను, ఇవాళ ళ్ళెవరూ జ్ఞాపకం చేయడం లేదని ఆఫీసు గుమాస్తా బాధపడుతున్నాడు.

లౌడ్ స్పీకర్ వైపు చూశాడు. ఇంకా 'కర్ కర్" శబ్దం వస్తోంది. చూపులు "వైర్" వెంట చెట్టు దిగి ఓ గది (క్లాస్రూం) తలుపు సందులో పడి నలిగాయి. వైర్లాగా —

అనుకోకుండా. అతని కాళ్ళు ఆ గది వైపు నడిచాయి. గదిలో ప్యూన్ ఎంకులు గ్రామఫోన్తో కుస్తీ పడుతున్నాడు.

"అజ్జెది పోయిందని ఎర్కుండి మల్లెందుకు పెడ్తానవ్"

"రంగారెడ్డి సార్ బెట్టమన్నడు సార్"

'నువ్వెంతపోః" అన్నట్లుందా సమాధానం! అవును మరి రంగారెడ్డి మంచి ఆస్తిపరుడు. ఏదో కాలక్షేపానికి టీచరుద్యోగం చేస్తున్నాడుగాని ....... దృష్టి ఆ గదిలోనే ఓ మూలవున్న 'లై' గిన్నె మీదికి మళ్ళింది. ఈగలు, దోమలతో ఛండాలంగా వుంది. నిన్న అన్ని రంగు కాగితాల్ని అతికించి,

ఆవరణంతా కళ ఉట్టిపడేట్టుగా చేయగల్గిన 'లై' – 'గిన్నె'ను ఎవరూ చూడడంలేదు. అతని మనసు మూలిగింది —

గది బయటికి నడిచే సరికి, ఆఫీసు నుండి హెడ్మాస్టరు హడావిడిగా వస్తూ - "ఏమిటీ పూరికే తిరుగుతున్నావా? తాడు తెప్పించావ్? గ్రామస్థులంతా ఒచ్చేస్తున్నారు ఆ వెంకుల్ని తీసుకుని అక్కడంతా అరేంజ్ చేయ్. స్టేజి నువ్వే చూస్కో బ్లాక్ ప్రెసిడెంట్ వాళ్ళు వచ్చేటైం కూడా అయింది .... —" చెపుతూనే మళ్ళీ వెళ్ళిపోయాడు లోనికి.

ఇటు హెడ్మాస్టరు హుకుం జారీ చేస్తాడు. అటు ప్యూను పనులు వినడు. తనేం చేసేట్లు - ? చిన్నప్పుడు స్నేహితులనేవారు "నీపేరు రామనాథం. కాదురా 'మధ్య'నాథం - నీవెటు కాకుండా పోతావ్ చూస్కో" - అని.

వెనక్కి తిరిగి మళ్ళీ అదే గదిలోకి, వెంకులూ .... వెంకులూ అనే శబ్దాల్ని మొదలు పంపిస్తూ వాటి వెనకాలే, అతను వెళ్ళాడు.

'మీ ప్రియాతి ప్రియమైన తెలుగు అనౌన్సర్, మీనాక్షీ పొన్నైదురై' - అంటూ రేడియో సిలోన్ నుండి వస్తున్నట్లు స్టాఫ్ రూం నుండి వినిపిస్తోంది.

బయట గ్రౌండ్‌కో చాలా మంది అయ్యారు. ఎండ తగ్గింది. దూరంగా, పిల్లలది కో కో ఫైనల్ గేమ్ అయిపోవచ్చింది విజిల్స్ - చప్పట్లు - కేకలు :

మనుషుల, చెట్ల, వస్తువుల నీడలు పొడుగవుతూ, పలచబడుతున్నాయ్.

కొంచం సేపట్లో -

"తాలూకా అయికూడా యిచేం రోడ్లు" అని బ్లాక్ ప్రెసిడెంట్ ఉత్తను రావు అనుకునేట్లుగా గోతులు, మిట్టలపై నుండి జీప్ చక్రాలు తిరగ్గా బడి ఆవరణలో కొచ్చింది. జీబు ఆగగానే పెద్దలు( పిల్లలు ఎందరో చుట్టుముట్టారు.

జీబు కన్పించదం లేదు దూరంగా ఓ మూలకు కూర్చుని చుట్టలు కాలుస్తూ కబుర్లాడుకునే కూలి జనమంతా పరుగెత్తు కొచ్చారు జీబు వైపు -

ఆటలన్నీ అయిపోయాయ్. ఒక తాడు గుంజుడు పోటీ కావాల్సి ఉంది ఈ పోటీ ఇక్కడిదే ప్రథమం, అంతకు ముందెన్నడూ పెట్టలేదు. అందుకే చాల మంది, అ పోటీని చూడాలని వచ్చారు.

ఒక్క చేయితో పట్టలేనంత లావుగా వున్న తాడును గ్రౌండులో పొడుగ్గా పరిపిస్తున్నాడు క్లర్కు - అప్పుడే చూశాడు తన స్నేహితులెంతో మంది వచ్చారని మిగతా ఆఫీసుల్లోని గుమస్తాలు, యన్. జి. ఓ లు,

జీబులోని నాయకులనబడే వాళ్ళు స్కూలు లోనికెళ్లారు. స్నేహితుల్ని ఒక్కొక్కర్ని స్కూలు క్లర్కు కలుస్తున్నాడు -

కొద్ది సేపట్లో అందరూ బయటికొచ్చారు తాడు గుంజడం పోటి సిద్ధ మయింది. కొందరొక చివరను, మరికొందరు మరొక చివరను పుచ్చుకున్నారు, మధించడానికి పాలసంద్రము, మేరు పర్వతమూ లేవుగాని, దాదావు రాక్షసులు. దేవతలు వాసుకిని పట్టుకున్నట్లు - ఉన్నారు.

బ్లాక్ ప్రెసిడెంట్ ఉత్తమరావుగారు, త్రాసు సూచికలాగా, చక్కగా మధ్యన నిలబడ్డారు అంతకు ముందేలోన త్రాగిన డ్రింక్స్ బాపతు త్రేపు .... కమ్మగా రాగా -

కాని ఒక చివర చాలా మంది అయ్యారు - మరో వైపు జనం తక్కు వగా వున్నారు. సమానంగా వుండండి అంటే ఎందుకో గాని నిరాకరించారు. బద్ధ శత్రువుల్లాగ చూసుకుంటున్నారు.

"విజిల్" అయింది. ఇరు పక్షాలవారూ, ఎదుటి పక్షాన్ని లాగేయాలన్న తాపత్రయం కొద్దీ లాగుతున్నారు. ఓ నిముషమయింది. తోటి వాళ్ళకు ధైర్య వచనాలు చెప్పుకుంటున్నారు.

"లాగేయండి లాగేయండి - లాగండి ల....లా

గుంజ - గుంజా - గుంజుకొయ్ -" మరో నిముషమయింది. తాడు మధ్య భాగం మెలికలు తిరుగుతోంది ప్రేక్షకుల్లో అదుర్దా పెరుగుతోంది -

స్కూలు గుమస్తా, అతని స్నేహితులు, పోటీలో పాల్గొనలేదు. ప్రేక్ష కులుగానే మిగిలి పొయ్యారు. తాడు మధ్య భాగం లామే అయినట్లు కమిలి పొయ్యారు. వాళ్ళ బ్రతుకు అంతంత మాత్రమే అయినట్లు పాల్గొనే అర్హత లేనట్లు-

కొద్దిగా వున్న వాళ్లేం కష్టపడడంలేదు. సునాయాసంగా తాడును బాలెన్స్ చేస్తున్నారు.

చాలా మందివున్న వాళ్లు, మహా తీవ్రంగా తాడు గుంజి పట్టారు. ఏ క్షణంలో అవతలి కొద్ది మందిని లాగేస్తారోనన్నట్లు - గ్రౌండులో దుమ్ము లేస్తుంది పాదాల కదలికవల్ల !

“ఈ ఎక్కువమంది. అవతలి కొద్ది జనాన్ని సులభంగా లాగేయగలరు, మొదట కొంచెం బెట్టుగావున్నా” - ప్రేక్షకులు అభిప్రాయం ఏర్పరుచు కుంటున్నారు.

ఉత్తమరావుగారు, ప్రసన్నంగా వున్నారు కావాలంటే భవిష్యత్తు చెప్ప గలనన్నట్లు -

ఇరు పక్షాలు గుంజుకుంటున్నాయ్ -

చూపులు, చూపులు గుంజుకుంటున్నాయ్ -

బలం, బలం, గుంజుకుంటోంది.

క్షణం, క్షణం గుంజుకుంటోంది -

మధ్యలో ఓ క్షణాన -

కొద్దిగున్న వాళ్ళే, చాలా ముందున్న పక్షాన్ని లాగేసి గెలిచారు.

ఆశ్చర్యం కలిగించేరు -

ప్రేక్షకుల ఆశలు పగిలాయి - ఊహలకు ఉరి పడింది.

పెద్దగోల .... చప్పట్లు .... ఈలలు —

విజిల్ మళ్లీ వినిపిస్తోంది. చాలా మంది వున్న పక్షంలో చాలా మంది పడి గీసుకుపోయి దెబ్బలు తిన్నారు.

ఖిన్నులయ్యారు.

బ్లాక్ ప్రెసిడెంట్, ఉత్తమరావు, గెలిచినవారిని చూసి కళ్ళు మెరిపిస్తు న్నారు. చిరునవ్వులతో మురిపిస్తున్నారు.

స్కూలు గుమాస్తా, అతని మిత్ర బృందానికి విచారంలేదు - సంతోషం లేదు. ప్యూనుకు, క్లర్కుకు మళ్ళీ పని పడింది. స్టేజి అరేంజ్ చేయడంలో మరో పది నిమిషాల్లో ఉపన్యాసం ప్రారంభమయింది, ఉత్తమరావు చెబుతు న్నాడు.

"... నాకుతెల్సు కొద్దిగున్నోళ్ళే గెలుస్తారని గిట్లజర్గుతదని మొదట్నుంచి ఇట్లనే జరుగుతాంది. గనక, ఇప్పుడు గిట్లనే జరిగింది. (ప్రజలు స్కూలు పిల్లలు ఆశ్చర్యపొయ్యారు. గెలిచినవారు చప్పట్లు కొట్టారు. స్కూలుపిల్లలు కూడా కొట్టారు. వాళ్ళకేమీ తెలీదు గనుక:) చాలా మందుండి కూడ గెల్వలేక పోయిండ్రు - ఏం లాభం? మీరు మీ ప్రతిపక్షం ఓట్లోలెగావాలె. (ప్రతిపక్షం వాళ్ళు కానీయరేమో) మీరు దేశంల శాలముందున్నరు. అందెక దేశం యిట్లున్నది. మీరు బాగుపడ్తె దేశం బాగయినట్లే (చప్పట్లు .... కేకలు ....) "— చాలా చెబుతున్నాడు. గుమాస్తాకు వినాలనిపించడంలేదు - అతని స్నేహితులు కూడా ఎవరు వినడంలేదు. దూరంగా అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నారు.

"కొద్దిమందున్న వాళ్ళు - తెల్లనిబట్టలవాళ్ళు, ధనవంతులు! చాలా మందున్నవాళ్ళు - చిరిగిన పేగుల ఎండిన డొక్కల బీదవాళ్ళు !!

ఈ సమాజపు ఆటస్థలంలో దుమ్ము రేగుతోంది —"

— విషాదంగా నవ్వుకుంటూ అంటున్నాడు స్కూలు గుమస్తా.

మా గురించి ఆలోచించే వాళ్లెవరు? - అతనిలో ఆలోచన.

రక్తనాళాలు రెండువైపులా ఎవరోలాగి పట్టిట్లయి గుండె గోడలు పగిలి పక్కెబారి రక్తంకారి ఎఱ్ఱముద్దగా అయినట్లనిపిస్తోంది —

ఆకాశంలో సూర్యకిరణాలు, పరుచుకున్నట్టు స్పష్టంగా వున్నాయి. రెండువైపుల నుండి కిరణాలు సూర్యుణ్ని బలంగా లాగుతున్న కొద్దీ పగిలి రక్తం కక్కుతున్నట్లు సూర్యుడు మరీ ఎఱ్ఱగా —

వరండాలో ప్యూను పెట్రోమాక్స్ వెలిగించే యత్నం చేస్తున్నాడప్పుడే అది వెలగడంలేదు ఆరిపోవడం లేదు —

మధ్యతరగతి జీవితంలా - వెలుగుతూ, ఆరుతూ, మండుతోంది.

1972

—